31న కాకినాడలో వికాస జాబ్ మేళా

ప్రజాశక్తి-కాకినాడ

వికాస కార్యాలయంలో ఈ నెల 31న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ కె.ఎల్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్స్లో రిలేషన్షిప్ మేనేజర్ (సేల్స్), కంప్యూటర్ ఆపరేటర్, టెక్నీషియన్, ఎగ్జిక్యూటివ్, నిట్ (ఐసిఐసిఐ) బ్యాంక్ రిలేషన్షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ, ఇసుజు మోటార్స్, డిక్సన్ కంపెనీలో టెక్నీషియన్, కొటక్ మహీంద్రా లైఫ్ ఇన్సూరెన్స్లో బిజినెస్ అసోసియేట్ పోస్టుల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. డిడియుజికెవై స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. అభ్యర్థులందరూ ఈ నెల 31న కలెక్టరేట్ ప్రాంగణంలోని వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జిరాక్స్తో హాజరవ్వాలన్నారు.

నిద్రలో స్మార్ట్ సిటీ నిఘా

- నిలిచిన సిసిసి సేవలు
- పెరిగిన చోరీలు, నేరాలు

స్మార్ట్ సిటీలో పని చేయకుండా పడి ఉన్న పరికరాలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడలో వృద్ధుడు ఎం.శ్రీనివాస్ సాయంత్రం వాకింగ్ చేస్తుండగా ముసుగు ధరించి బైకుపై వచ్చిన ఆగంతకులు ఆయన దగ్గర ఉన్న డబ్బులు, సెల్ ఫోను లాకుని పరారయ్యారు. దీనిపై టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా నిందితులను పట్టుకునేందుకు ఎటువంటి ఆధారం లేకపోయింది. దేవాదాయశాఖ కార్యాలయం వద్ద గత ఆదివారం వాకింగ్ చేస్తున్న ఒక వృద్ధుని బైకుపై వచ్చిన ముగ్గురు తీవ్రంగా కొట్టి సెల్ఫోన్, బంగారం అపహరించుకుపోయారు. నిందితులు పట్టుకునేందుకు ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో కేసులు అలాగే పెండింగ్లో ఉన్నాయి. కాకినాడలో జరుగుతున్న వాటిలో ఇవి మచ్చుకే.. కాకినాడ స్మార్ట్సిటీ తలమానికంగా నిలిచిన సిసిసి (కమాండ్ కంట్రోల్ సెంటర్ స్టెరిలైట్) నిర్వహణలో ఎన్నో సేవలందించింది. ఇతర స్మార్ట్ సిటీ చైర్మన్లు, అధికారులు కూడా కాకినాడ సిసిసి సందర్శించిన సందర్భాలు కూడా ఉన్నాయి. స్టెరిలైట్ సంస్థకు రూ.19.50 కోట్లు నిధులు బకాయిలు ఉండడంతో ఆ సంస్థ పక్కకు తప్పుకున్న విషయం తెలిసిందే. ఈ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఎటువంటి విద్యార్హతలు లేని ఒక వ్యక్తికి స్మార్ట్ సిటీ పగ్గాలు అప్పగించింది. నెలకు రూ.1.60 లక్షలు జీతం చెల్లిస్తోంది. దీనివల్ల ఎటువంటి ప్రయోజనం లేదని అధికారులకు తెలిసి వచ్చింది. కొన్నిరోజులుగా సిసిసి సేవలు కాకినాడ ప్రజలకు అందక నగరంలో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రధాన కూడళ్లో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతోపాటు టోల్ ఫ్రీ, వైఫై, కొన్నిచోట్ల సిసి కెమెరాలు, నెంబర్ ప్లేట్లు, ఫేస్ రికగ్నేషన్, వీఎండిలు, పబ్లిక్ ఎనౌన్స్ మెంట్లు, ఎస్వీఎస్లు ఇలా సిసిసి ఆధ్వర్యంలో 1,449 ఎలిమెంట్స్ పని చేయాల్సి ఉండగా ప్రస్తుతం 735 ఎలిమెంట్స్ డౌన్ అయ్యాయి. దీంతో ఈ సేవలు అన్నీ నిలిచిపోయాయి. సిసిసి ఆధారంగా నగరంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా అధికారుల సమన్వయంతో క్షణాల్లో పరిష్కరించేవారు. సిసిసి సేవలు నిలిచిపోవడంతో ఇప్పుడు పలు సమస్యలు పెరిగిపోయి అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఎన్ని షోకాజ్లు ఇచ్చినా సిటిఒ గైర్హాజరు

సిసిసి కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న సిటిఒ (చీఫ్ టెక్నికల్ ఆఫీసర్), రామారావు గైర్హాజరులో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన గైర్హాజరుతోనే సిసిసిలో పలు సమస్యలు తలెత్తున్నాయని అధికారులు చెబుతున్నారు. అధికారులకు గానీ, సిబ్బందికి గానీ ఎటువంటి సమాచారం లేకుండా ఆయనకు ఆయనే సెలవు ప్రకటించుకోవడం విశేషం. ఆయనకు ఎటువంటి అనుభవం లేకపోయినా గుజరాత్లోని సూరత్లో జరిగిన స్మార్ట్ సిటీల సదస్సులో ప్రత్యక్షమై అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. స్టెరిలైజ్ బాధ్యతలు నుంచి తప్పుకున్న తరువాత కొత్త కంపెనీకి టెండర్ నోటీసు ఇవ్వడానికి స్మార్ట్ సిటీ ఎస్ఇ సత్యనారాయణరాజు సమాచారం అడిగినప్పటికీ సిటిఒ స్పందించక పోవడంతో షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీనిపై ఎస్ఇ తనను వేధిస్తున్నారంటూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, మినిస్టరీ ఆఫ్ హౌసింగ్ అర్బన్ ఎఫైర్స్, జిల్లా కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. దీంతో కాకినాడ స్మార్ట్ సిసిసి అంశం హాట్ టాపిక్గా మారింది. అనుమతులు లేకుండా సిటిఒ గుజరాత్ వెళ్లడంపై స్మార్ట్ సిటీ ఎండి, నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు రెండోసారి షోకాజ్ నోటీస్ ఇచ్చారు. కొన్నిరోజులు ఎటువంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కావడంపై మూడో షోకాజ్ నోటీసు ఇచ్చారు. గత కమిషనర్ సమయంలో కూడా పలు షోకాజ్ నోటీసులు తీసుకున్నా ఆయనపై ఎటువంటి చర్యలూ తీసుకున్నట్లు దాఖలాలు కనిపించలేదు. స్మార్ట్ సిటీ ఉద్యోగులతో కూడా ఆయనకు సఖ్యత లేకపోవడంతో సిబ్బంది అంతా కమిషనర్కు ఫిర్యాదు చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. గతంలో పోలీస్ కమాండ్ కంట్రోల్ పరిధిలో సిసి కెమెరాలు పని చేస్తుండగా, స్మార్ట్ సిటీ వాటిని తీసి వీటిని ఉపయోగించారు. ఇప్పుడు అవి పని చేయక, వీటిని ఆధారాలుగా చేసుకుని కేసుల్ని ఛేదించే పోలీసు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కాకినాడలో విచ్చలవిడిగా దొంగతనం, గంజాయి కేసులు పెరుగుతున్నా వీటిపై నిఘా పెట్టడంలోనూ పోలీసు అధికారులు, వీటి కార్పొరేషన్ సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీనితో నిత్యం కాకినాడ రాష్ట్రవ్యాప్తంగా ఏదో విధంగా మారు మోగుతూనే ఉంది.

వరదలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కాన్ఫరెన్స్లో పాల్గొన్న ఇన్ఛార్జ్ కలెక్టర్ ఇలక్కియ, ఎస్పి

ప్రజాశక్తి-కాకినాడ

గోదావరి, ఇతర నదులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి జిల్లా అధికార యంత్రాంగాలను అప్రమత్తం చేశారు. శుక్రవారం తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుంచి సిఎం వైఎస్.జగన్, హోమ్, విపత్తుల నిర్వహణశాఖ మంత్రి తానేటి వనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి, డిజిపి కెవి.రాజేంద్రనాథ్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పిలు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా ఇన్ఛార్జ్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఎస్పి ఎస్.సతీష్ కుమార్ వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులతో కలిసి హాజరయ్యారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలు, ముంపు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలింపు, నిత్యావసర సరుకుల పంపిణీ, కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాల అమలు, వరద తగ్గాక చేపట్టాల్సిన పంట నష్టం వివరాల నమోదు వంటి అంశాలపై ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. విసి అనంతరం ఇన్ఛార్జి కలెక్టర్ ఇలక్కియ జిల్లాలోని పరిస్థితిపై అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం తదితరాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, వ్యవసాయం, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్ రెడ్డి, సిపిఒ పి.త్రినాథ్, ఆర్ అండ్ బి ఎస్ఇ కె.హరిప్రసాద్బాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మణిపూర్ ఘటనపై రాస్తారోకో, ధర్నా

ప్రజాశక్తి - తాళ్లరేవు

మణిపూర్లో హింసాకాండకు వ్యతిరేకంగా సిఐటియు, ఐద్వా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డుపై చెరువుగట్టు సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహశీల్దారు కార్యాలయం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కమిడి ఈశ్వరీబాయి, అంగన్వాడీ యూనియన్ నాయకులు పిల్లి వెంకటలక్ష్మి, పద్మజ, సిఐటియు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు అనంతలక్ష్మి, నాగలక్ష్మి, ఎంపిటిసి పోతుల రత్నకుమారి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజుబాబు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దుప్పి అదృష్ట దీపుడు, తణుకు రాజు పాల్గొన్నారు. బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, దళిత వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుంకరపాలెంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. వి.చంద్రమౌళి, కాశి లక్ష్మణస్వామి, జక్కల ప్రసాద్ బాబు, గుత్తాల శ్రీరాములు మాట్లాడారు.

దళితుల శ్మశానాల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ జిల్లాలో అనేక గ్రామాల్లో దళితుల శ్వశాన భూముల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో ఎఒ శ్రీనివాస్కు కెవిపిఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ దళజత నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కె ఎస్ . శ్రీ ని వా స్ మాట్లాడుతూ ఉమ్మడి ఎపిలో శ్మశానాల సమస్యలపై కెవిపిఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తే కోనేరు రంగారావు కమిషన్ వేశారన్నారు. ఆ కమిషన్ ఆధారంగా 1235 జిఒ విడుదల చేసి ప్రతి గ్రామంలో శ్మశానాలు లేని చోట మూడెకరాల భూమి కొనుగోలు చేసి ఇవ్వాలని జిఒ ఇచ్చారన్నారు. అయినప్పటికీ నేటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లాలో తాళ్లరేవు, కాజులూరు, పిఠాపురం మండలంలోని పి.తిమ్మాపురం, కరప మండలం గొర్రిపూడి తదితర గ్రామాల్లో దళితుల శ్మశానాల సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బుడితి సురేష్ కుమార్, కె.సింహాచలం, జిల్లా సహాయ కార్యదర్శి విప్పర్తి శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ఎలేటి నానిబాబు, ఎం.ఫ్రెడిక్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-కాకినాడ

జూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్న సభ్యులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఒఎన్జిసి హెచ్ఆర్ మేనేజర్ మహ్మద్ అన్వర్, జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు సూచించారు. కాకినాడ బస్టాండ్లో శుక్రవారం ఒఎన్జిసి, ఆలిండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, పకృతి సమతుల్యతపై సదస్సు నిర్వహించారు. ఈ ఈ సదస్సులో మహమ్మద్ అన్వర్, శ్రీనివాసరావు మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సమతుల్యాన్ని కాపాడడానికి తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలపై సూచించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానివేయాలని, ప్లాస్టిక్ స్థానంలో జ్యూట్ బ్యాగులు, గుడ్డ సంచులు ఉపయోగించాలని కోరారు. అనంతరం ఒఎన్జిసి ఆర్థిక సాయంతో ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ సుమారు 200 జూట్ బ్యాగులను బస్ స్టేషన్లో అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎంయువి మనోహర్, ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షురాలు భానుమతి, ట్రెజరర్ పద్మజవాణి, సభ్యులు విజయలక్ష్మి మీనాక్షి రత్నగిరి, ఉష అలివేణి, కామేశ్వరి, పద్మలత, కాకినాడ డిపో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీరందించాలని వినతి

ప్రజాశక్తి-పిఠాపురం


కమిషనర్కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

పట్టణ ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని సిపిఎం నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కుళాయి నుంచి వస్తున్న నీరు మురికిగా ఉంటున్నాయన్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన పైపులైన్లు తుప్పు పట్టాయని, పైపులైన్లు నిత్యం మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. మరమ్మతు చేయడం తప్ప తప్ప వాటిని ఆధునికీకరించడం లేదన్నారు. దాంతో మురికి నీరు సరఫరా అవుతుందని అటువంటి నీరు తాగితే అనారోగ్య పాలవ్వాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సిపిఎం నాయకులు కోనేటి రాజు, కరణం విశ్వనాథం, కె.మణి, పెదపూడి సత్యనారాయణ, అప్పారావు, అపర్ణశ్రీ, రాజు తదితరులు ఉన్నారు.

30న విజయవాడలో సదస్సు

ప్రజాశక్తి-కాకినాడ

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ కార్పొరేట్ దుష్పరిపాలన నుంచి రైతు, శ్రామికులను కాపాడాలని కోరుతూ ఈ నెల 30న విజయవాడలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పొనమండ రామచంద్రరావు ఫౌండేషన్ భవన్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల పంటల రుణాలు బకాయిలను రద్దు చేయాలని ఆయన కోరారు. కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోర్తులను కోడ్లను రద్దుచేసి కార్మికుల హక్కులను పునరుద్ధించాలని మధు డిమాండ్ చేశారు.

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురంలోని శివాలయం, వెంకటేశ్వర స్వామి ఆలయం ధర్మకర్తల మండల సభ్యులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి పాల్గొన్నారు. వెంకటేశ్వర స్వామి ఇఒ, శివాలయం ఇఒ పిఆర్కెఎస్ఎస్.సాయి ప్రసాద్,దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ చల్లా ఉదయ బాబు సమక్షంలో వీరు ప్రమాణ స్వీకారం చేశారు.

31న పెద్దాపురం కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 31వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని మున్సిపల్ కమిషనర్ కె.సురేంద్ర తెలిపారు. మున్సిపల్ చైర్పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎజెండాలోని 49 అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కొత్తలంకకు చేరిన వరద

ప్రజాశక్తి - తాళ్లరేవు

ధవళేశ్వరం ప్రాజెక్టు దిగువకు విడుదల చేస్తున్న వరద నీరు మండలంలోని లంక గ్రామాలకు చేరింది. పిల్లంక పంచాయతీ కొత్తలంకలో గృహాల వద్దకు నీరు చేరడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే కొత్తలంకలో కూరగాయల తోటలు కొద్ది మేర నీట మునిగాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు పోతురాజు, ఎంపిడిఒ అనుపమ ప్రజలకు తెలిపారు. పరిసరాల్లో విష జంతువులు చేరకుండా ముళ్ళకంపలను చెత్తను స్థానికుల సహాయంతో తొలగించాలని గ్రామస్థాయి అధికారులను ఆదేశించారు. ప్రతి ఏడాది జూలై నెలలో కొత్తలంక గ్రామానికి వరద నీరు పోటెత్తి ప్రజలు నిరాశ్రయులవుతుండడంతో ఈసారి అధికారులు ముందుగా అప్రమత్తమయ్యారు.

కళ్ల కలకల నివారణకు మందుల పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పెదబ్రహ్మదేవం శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కళ్ల కలకల నివారణకు హోమియో మందులు పంపిణీ చేశారు. సమితి గౌరవాధ్యక్షుడు వింజమూరి సుబ్రహ్మణ్య శర్మ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సమితి సభ్యులు నువ్వుల వెంకట్రాజు, తోటకూర రాంబాబు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు

జిల్లాలో పలుచోట్ల శుక్రవారం జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాజులూరు మండలం శలపాక, తణుకువాడ గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాల్లో బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు. రేషన్ కార్డులు, కుల, ఆదాయ, సిసిఆర్సి కార్డులు తదితరాలకు సంబంధించి 1,003 మందికి సర్టిఫికెట్లు, పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి వనుము వెంకట సుబ్బారావు, ఎంపిపి ఎం.భారతి మురళి, ఎంపిటిసి రమేష్, తహశీల్దారు సాయి సత్యనారాయణ, ఎంపిడిఒ రత్నరాజు, సర్పంచ్ పోతు గనిరాజు, నరాల సుబ్బరాజు, మండల కన్వీనర్ గుబ్బల యేసు రాజు , సత్తి శ్రీరామారెడ్డి, నల్లమిల్లి కాశీ ఈశ్వర రెడ్డి పంచాయతీ కార్యదర్శి అనంతలక్ష్మి పాల్గొన్నారు. **తాళ్లరేవు** ప్రతి సచివాలయంలో నెలరోజుల పాటు సభలు నిర్వహించినట్లు ఎంపిపి రాయుడు సునీత తెలిపారు. చొల్లంగిలో బూరెల వెంకటరాజు, చొల్లంగిపేటలో స్థానిక సర్పంచ్ గంగాభవాని అధ్యక్షతన జరిగిన సభలో ఎంపిపి రాయుడు సునీత మాట్లాడారు. ఆర్డబ్ల్యూఎస్. ఎఇ మారుతీ రావు, ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, ఎంపిడిఒ ఎం.అనుపమ, తహశీల్దారు పోతురాజు, జెడ్పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైసిపి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, ఉప సర్పంచ్ స్వర్ణ రాజు, ఎంపిటిసి సాయి లక్ష్మి, శివాజీ గణేష్, మాస శ్రీనివాస్, సూర్యకుమారి, నూకరాజు, కడియాల శ్రీనివాస్, హరిబాబు, నీలపల్లి రాజు, జమాన్, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సుధారాణి పాల్గొన్నారు. **పెద్దాపురం** మున్సిపల్ చైర్పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి 25, 27 వార్డులకు సంబంధించిన 14వ సచివాలయంలో జరిగిన సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, మేనేజర్ జ్యోతి రాణి, ఆర్ఒ చంద్రశేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు బొబ్బిలి వీర వెంకట దుర్గ, పప్పల దుర్గారావు, కొట్టి పవన్ కిషోర్, విడదాసరి రాజా, కో ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, వైసిపి నాయకులు చింతా శ్రీనివాసరావు, సచివాలయం అడ్మిన్ ఎ.రవి కిరణ్ పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష గ్రామ సభల్లో లబ్ధిదారులకు 6,567 సర్టిఫికెట్లు అందజేసినట్లు మున్సిపల్ చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ తెలిపారు. అమ్మణ్ణమ్మ అపార్ట్మెంట్ల వద్ద 15వ సచివాలయ పరిధిలో సభ నిర్వహించారు. కమిషనర్ జె.రామారావు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల ప్రారంభోత్సవానికి చర్యలు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న ఇళ్ల నిర్మాణాన్ని మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు వేగవంతం చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆదేశించారు. శుక్రవారం సామర్లకోట జి.రాగంపేట రోడ్డులోని జగనన్న కాలనీ ఇళ్ల గృహ సముదాయాల వద్ద పనులను దొరబాబు ప్రారంభించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సామర్లకోటకు వచ్చే అవకాశాలు ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సుధాకర్ పట్నాయక్, డిఇ రాజు, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, మున్సిపల్ డిఇ హుస్సేన్, ట్రాన్స్కో ఎడి కిరణ్, ట్రాన్స్కో ఇఇ ప్రభాకర్, వైసిపి రాష్ట్ర నాయకులు ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో కూలిన ఆర్బికె సన్షేడ్

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

ఆర్బికె కేంద్రంలో కూలిన సన్ సైడ్

మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఆర్బికె కేంద్రం భవన సన్షేడ్ కూలింది. పూర్తిస్థాయిలో శిథిలావస్థకు చేరిన తుపాను షెల్టర్లో కేంద్రం నిర్వహిస్తుండగా పైభాగంలో సచివాలయాన్ని నిర్వహిస్తున్నారు. తుపాను షెల్టర్ శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు శుక్రవారం ఆర్బికె కార్యాలయ సన్ సైడ్ ఒకసారి గా కుప్ప కూలింది ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని అక్కడ వారు చెప్తున్నారు కొత్తపల్లిలో సచివాలయభవనం, ఆర్బికె కార్యాలయం నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో వేరే గత్యంతరం లేక శిథిలావస్థలో ఉన్న తుఫాన్ షెల్టర్లోనే ఈ రెండు కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. నేటికీ వర్షాలకు లీకేజీలు వస్తున్నా అక్కడే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. గ్రామంలో సచివాలయ భవనం పూర్తి కాకపోవడంతో కొత్తపల్లి తుపాన్ షెల్టర్లో విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెను ప్రమాదం చోటు చేసుకోక ముందే శిథిలావస్థలో ఉన్న తుపాను సెంటర్ నుంచి గ్రామ సచివాలయాన్ని, ఆర్బికె కేంద్రాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తుని సిఐగా రామకృష్ణ బాధ్యతలు

ప్రజాశక్తి-కోటనందూరు

తుని పట్టణ సిఐ గీత రామకృష్ణ శుక్రవారం బాధ్యతలను చేపట్టారు. ఆకివీడు సర్కిల్ నుంచి బదిలీపై వచ్చి తుని సిఐగా బాధ్యతలు చేపట్టారు. తుని సిఐగా విధులు ఇస్తున్న ఎం.నాగ దుర్గారావును ఏలూరు రేంజ్ విఆర్కు తరలించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గీతా రామకృష్ణ మాట్లాడుతూ తుని పట్టణంలో శాంతిభద్రతలకు కాపాడేందుకు చర్యలు చేపడతామన్నారు. రాత్రి సమయాల్లో గస్తీని ముమ్మరం చేస్తామని, ప్రజలకు ప్రజాప్రతినిధులకు నిత్యం అందుబాటులో ఉంటామని అన్నారు.

లోకేష్ యాత్రలో పెద్దాపురం నాయకులు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

ఒంగోలులో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో శుక్రవారం పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయ చినరాజప్ప సహా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం సామర్లకోట నుండి వాహనాల్లో వీరంతా ఒంగోలు తరలి వెళ్లారు. లోకేషను కలిసి యాత్రకు సంఘీభావం ప్రకటించారు. పాదయాత్రలో ఎంఎల్ఎ చినరాజప్ప వెంట టిడిపి నాయకులు రాజా సూరిబాబు రాజు, అడబాల కుమారస్వామి, పాలకుర్తి శ్రీనివాసా చార్యులు చౌదరి (శ్రీనుబాబు), తోటకూర శ్రీనివాస్, నిమ్మకాయల కిరణ్ కుమార్ ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-గండేపల్లి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. శుక్రవారం మల్లేపల్లిలో సెంటర్ వైద్యాధికారి అనూష ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రతి ఇంటినీ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుస్తున్న వర్షాల దష్ట్యా నీరు నిలవ ఉండరాదన్నారు. నిల్వ ఉన్న యెడల డెంగ్యూ సోకే ప్రభావంతో పాటు అనేక అంటూ రోగాలు ప్రబలుతాయని సూచించారు.

కార్టూ'నిజం'



యూజర్ ఛార్జీలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మెరుగైన పారిశుధ్య సేవల కోసం ప్రతిపాదించిన యూజర్ ఛార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ మహేష్ కుమార్ రావిరాల సంబంధిత సిబ్బందికి సూచించారు. స్థానిక స్మార్ట్సిటీ కార్యాలయంలో యూజర్ ఛార్జీల వసూళ్లు, ఖాళీ స్థలాల గుర్తింపు, ఆస్తిపన్నుల వసూళ్ల అంశంపై శుక్రవారం సాయంత్రం శానిటేషన్, రెవెన్యూ విభాగానికి చెందిన అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందించాలనే లక్ష్యంతో హూపర్ టిప్పర్ వాహనాలను, ప్రత్యేకంగా సిబ్బందిని కూడా నియమించి ఇంటింటికి చెత్త సేకరణ చేస్తున్నామన్నారు. ఇందుకు అయ్యే రూ.లక్షలాది వ్యయాన్ని యూజర్ ఛార్జీల ద్వారా మాత్రమే భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అందువల్ల నిర్ణీత యూజర్ ఛార్జీలను విధిగా వసూలు చేయాలని ఆయన సంబంధిత సిబ్బందికి సూచించారు. ఛార్జీలు పూర్తిస్థాయిలో వసూలు కాకపోతే ఆ ఖర్చు నగరపాలక సంస్థ సాధారణ నిధుల ద్వారా భరించాల్సి ఉంటుందన్నారు. ఇది నగరాభివద్ధిపై ప్రభావం చూపించే అవకాశం ఉన్నందున ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

నేరాలు ఘోరాలు

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఒక బాలిక అదృశ్యమైన సంఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఒక గ్రామానికి చెందిన బాలిక గురువారం ఇంటి నుండి బయటకు వెళ్ళింది. సాయంత్రం అయినప్పటికీ తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గ్రామాలు, బంధువుల ఇళ్ల వద్ద గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ తెలిపారు

ఇంట్లో ఆభరణాలు, నగదు చోరీ

ప్రజాశక్తి-గోపాలపురం

ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ఆభరణాలు, నగదు దోచుకు వెళ్లిన సంఘటన మండలంలోని వెదుళ్ళకుంటలో శుక్రవారం చోటు చేసుకుంది. డిఎస్‌పి విఎస్ఎన్ వర్మ, క్లూస్ టీమ్స్ ఇంటిని పరిశీలించి వివరాలను సేకరించారు. వెదుళ్ళకుంట గ్రామానికి చెందిన జొన్నలగడ్డ నాగ కుమారి ఈ నెల 16న హైదరాబాద్ వెళ్లారు. తిరిగి శుక్రవారం వచ్చారు. ఇంటి తాళాలు పగలగొట్టినట్టు గుర్తించారు. దీనిపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం డిఎస్‌పి విఎస్ఎన్ వర్మ, క్లూస్ టీమ్స్, పోలీస్ సిబ్బంది బాధితుల వివరాలు సేకరించారు. సిఐ అనసూరి శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టారు.

చోరీపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

పెదగాడవిల్లి లోని ఒక ఇంట్లో జరిగిన చోరీపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు కథనం ప్రకారం పెదగాడవిల్లికి చెందిన నూకల సోమరాజు ఈ నెల 14న ఇంటికి తాళం వేసుకుని బెంగళూరు కుమార్తె ఇంటికి వెళ్లారు.తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చి తాళం తీసి చూడగా చోరీ జరిగినట్టు గుర్తించారు. గదిలోని బీరువా తెరిచి చూడగా తొమ్మిది కాసుల బంగారం, కెజి వెండి వస్తువులు అపహరణకు గురైనట్టు గుర్తించారు.

లారీనీ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

సీతానగరం శివారున గుర్తు తెలియని వ్యక్తి లారీని ఢీ కొని అక్కడికక్కడే మతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. జగ్గంపేట ఎఎస్ఐ సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం పెద్దాపురం నుంచి జగ్గంపేట వస్తున్న లారీని బైకుపై వస్తున్న వ్యక్తి ఢీకొని అక్కడికక్కడే మతి చెందినట్లు తెలిపారు. మతుని వయసు సుమారు 55 ఉంటుందని ఆయన తెలిపారు.

కుటుంబ సభ్యులకు వ్యక్తి అప్పగింత

ప్రజాశక్తి-రంగంపేట (గండేపల్లి)

రంగంపేట మండలంలోని కోటపాడు గ్రామంలో ఈ నెల 22న రాత్రి అల్యూమినియం ఫ్యాక్టరీ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. అతడికి మతి స్థిమితం లేదని గుర్తించారు. ఎస్ఐ టి.రామకృష్ణ అతడికి వైద్యం చేయించి వివరాలు సేకరించారు. అతని ఫేస్‌బుక్ ఆధారంగా అతనిని నేపాల్ వాసి విజయ్ వాజ్‌పేయిగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు శుక్రవారం వచ్చారు. వారికి అతడిని పోలీసులు అప్పగించారు.

అదుపు తప్పి లారీ బోల్తా

ప్రజాశక్తి-గోపాలపురం

టీ తాగేందుకు నిలుపుదల చేసిన గ్రానైట్ లోడు లారీ వెనక్కు వెళ్లి అదుపుతప్పి లంకలో బోల్తా పడిన సంఘటన గోపాలపురం టొబాకో బోర్డు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. టొబాకో బోర్డు వద్ద జాతీయ రహదారిపై లారీ నిలుపుదల చేసి టీ తాగేందుకు డ్రైవర్ వెళ్ళాడు. రోడ్డు పల్లంగా ఉండడంతో లారీ వెనుకకు సుమారు 150 మీటర్లు వెళ్లి అదుపుతప్పి రోడ్డు లంకలో బోల్తా పడింది. ఈ సంఘటనలో రోడ్డుపై ఎటువంటి వాహనాలు రాకపోవడంతో, లారీలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం చోటు చేసుకోలేదని స్థానికులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

మండల కేంద్రం ఉంగ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం ఉదయం నుంచి మతి స్థిమితం లేకుండా, మద్యం సేవించి, ఉంగ్రాజవరం వీధుల్లో తిరిగినట్లు స్థానికులు తెలిపారు. అతడు ధరించిన చొక్కాపై నిడదవోలు ఆర్‌కె టైలర్ లేబుల్, మెడలో జంధ్యం ఉందన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు సమాచారం తెలియచేయాలని ఉంగ్రాజవరం పోలీసులు తెలిపారు.

ముంపునకు గురైన కొమరగిరి ఇళ్ల స్థలాలు

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

పేదలకు ఇళ్ల స్థలాలు అని చెప్పి కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి రూ.కోట్లు దోచుకుని కాకినాడ నగర ప్రజలను నట్టేట ముంచారని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) విమర్శించారు. యు కొత్తపల్లి మండలం కొమరగిరి ప్రాంతంలో ముంపునకు గురైన కాకినాడ నగర ప్రజలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాలను శుక్రవారం కొండబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఎంఎల్ఎ ద్వారంపూడి తన స్వార్ధ ప్రయోజనాల కోసం 18 కిలోమీటర్ల దూరంలోని కొమరగిరిలో ఇళ్ల స్థలాలను ఇచ్చి లబ్ధిదారులను నట్టేట ముంచారన్నారు. చిన్నపాటి వర్షానికే కొమరగిరి కాలనీ ముంపునకు గురవుతోందన్నారు. నాసిరకం నిర్మాణాలు చేపడుతున్నారని, మరో పక్క సముద్రపు కెరటాలు ఎగసిపడి రహదారులు సైతం కోతకు గురవుతున్న విషయం తెలిసి కూడా ద్వారంపూడి తన స్వలాభం కోసం కొమరగిరిలో భూములు తీసుకుని మెరక పనుల పేరుతో పెద్దాపురంలోని ప్రభుత్వ కొండలను తవ్వి ఫిల్లింగ్ చేసి రూ.కోట్లు దోచుకున్నారన్నారు. సుమారు 350 ఎకరాల్లో 16 వేల మందికి స్థలాలు ఇస్తే నేడు కొమరగిరి ప్రాంతంలో 100 లబ్ధిదారులు కూడా ఇల్లు నిర్మించుకోలేని పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, మాజీ కార్పొరేటర్లు తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ పాల్గొన్నారు.

నీట మునిగిన కొమరగిరి లేఔట్లు

మధుమేహంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

గాంధీనగర్ వంటిమామిడి జంక్షన్ వద్ద గల అశ్విని హాస్పిటల్లో అలయన్స్ క్లబ్ అధ్యక్షులు కిరణ్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం మధుమేహ వ్యాధిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, పిఆర్ఓ మాటూరి శిరీష, వైస్ గవర్నర్ వనుం శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 60 మందికి మధుమేహ పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ మధుమేహం వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మధుమేహ వ్యాధి వచ్చిన వారు భయపడాల్సిన అవసరం లేదని క్రమం తప్పకుండా ప్రతినెల మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని మందులను వాడాలన్నారు. మాటూరు శిరీష మాట్లాడుతూ మధుమేహ వ్యాధి ఉన్నవారు క్రమం తప్పక వ్యాయామం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పెంకే గోవిందరాజు, కోశాధికారి కొత్త శ్రీరాములు, మణికంఠ, వనుం ఉపేంద్రనాథ్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

31న లై డిటెక్టర్ చర్చకు సిద్ధం : దొరబాబు

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

తాను ముందుగా చెప్పినట్టు ఈ నెల 31న 'లై డిటెక్టర్ టెస్ట్'కు తాను సిద్ధంగా ఉన్నానని ఆ పరీక్షలో తన నిజాయితీ రుజువు కాకుంటే రాష్ట్ర హౌసింగ్ చైర్మన్ పదవికి, వైసిపి పెద్దాపురం ఇన్‌ఛార్జి పదవికి రాజీనామా చేసి సామాన్య సభ్యునిగా పార్టీలో కొనసాగుతానని చెప్పారు. ఒకవేళ ఎంఎల్ఎ చినరాజప్ప నిజాయితీ రుజువు కాకుంటే ఏమి చేస్తారని ప్రశ్నించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో దొరబాబు మీడియాతో మాట్లాడారు. అవినీతి నిరూపణపై 'లై డిటెక్టర్ టెస్ట్'కు తాను విసిరిన సవాల్‌ను చినరాజప్ప స్వీకరించడం ఆనందదాయకమన్నారు. 100 రూపాయల స్టాంప్ పేపర్లపై ఈ పరీక్షకు అంగీకరిస్తున్నట్టు ఇరుపక్షాలు సంతకాలు చేసి అందించాలని చెప్పారు. స్టాంపు పేపర్లను తానే సిద్ధం చేశానని, అవి ఎక్కడ అందించమంటే అక్కడకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని దొరబాబు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్‌లు ఊబా జాన్ మోజెస్, నెక్కంటి సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

స్టాంప్ పేపర్లు చూపుతున్న దొరబాబు

కరపలో మొబైల్ అన్న క్యాంటీన్

ప్రజాశక్తి -కరప

కరప బజార్ సెంటర్లో అన్న క్యాంటీన్ నిర్వహించినట్లు టిడిపి మండల అధ్యక్షుడు దేవువెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం దేవు వెంకన్న ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ప్రభాకర్ సమ 'హర్చిన వాటిని మినీ వ్యాన్‌పై ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ కరప గ్రామంలో 10 రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. టిడిపి పరిపాలన కాలంలో ప్రజలు ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్లను వైసిపి ప్రభుత్వం వచ్చాక తొలగించడం చాలా విచారకరమైన సంఘటన అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటలక్ష్మి, జగ్గారావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీ సమస్యలపై రోగులకు అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ

కెసిబిఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంస్థ సభ్యులకు శుక్రవారం కిడ్నీ సమస్యలు- తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సంస్థ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి, డైరెక్టర్లు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ప్రముఖ నెఫ్రాలజిస్ట్ పల్లపోటు రవీంద్ర, కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సా నిపుణులు, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ సీమకుర్తి సూర్య నిహార్ వైద్య శిబిరంలో అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చారు. వైద్య సేవలు అందించారు. తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కె.సత్యనారాయణమూర్తి, రెడ్డి వీర రాజేంద్ర కుమార్, ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బుచ్చిరాజు శివ బాలయోగి, కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, మేనేజర్ చీమల కొండ గంగాధరం పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న కొండబాబు

'టిడిపితోనే మహిళల అభ్యున్నతి'

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

మహిళల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, వైసిపి పాలనలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. టిడిపి భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా 8వ డివిజన్ కొత్త కాకినాడలో ఆయన పర్యటించారు. మహాశక్తి మేనిఫెస్టోపై మహిళలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన మహనీయుడు ఎన్‌టిఆర్ అని, చంద్రబాబు ప్రభుత్వ హయాంలో డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి మహిళల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చారని చెప్పారు. మహిళలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ఇచ్చి చట్ట సభల్లో గౌరవంగా నిలబెట్టిన నాయకుడు చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, సీకోటి అప్పలకొండ, మమతా శ్రీనివాస్, దాసరి సత్యవతి, ఇల్లా గోవిందమ్మా, సుబ్బమ్మ, మోసా దుర్గమ్మ, చోడిపిల్లి అమ్మోరమ్మ, మైలిపిల్లి మసేనమ్మ, సూరడా నూకాలమ్మ, బడే సత్యారావు, చొక్కా బాబూరావు, మైలపిల్లి తాతారావు, కోడా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి అన్నవరం

పర్యావరణం పరిరక్షణకు మొక్కలు పెంపకమే శరణ్యమని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నవరం బైపాస్‌లో ఉన్న సత్యదేవుని సొంత క్షేత్రంలో మారేడు, తులసి, జమ్మి, సంపంగి ఔషధ మొక్కలను కమిషనర్ తన సతీమణి స్వర్ణ శ్రీతో కలిసి నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మానవుడు తన జీవన మనుగడ కోసం పర్యావరణాన్ని కాపాడే పచ్చదనాన్ని ఇచ్చే వృక్షాలను నిర్వీర్యం చేస్తున్నాడన్నారు. తద్వారా మానవాళి, మానవాళికి పయోగపడే సహజ వనరులు క్షీణించి కాలానికి అను గుణంగా వాతావరణం మార్పులు కలవడం లేదని చెప్పారు. వీరికి దేవస్థానం ఇఒ ఎస్.ఆజాద్, చైర్మన్ ఐవి రోహిత్ స్వాగతం పలికారు.

సహకార సంఘాల అధ్యక్షులు మార్పు

ప్రజాశక్తి-కాజులూరు

మండలంలోని రెండు సహకార సంఘాల అధ్యక్షులు మార్పు చేశారు. మండలంలోని జగన్నాథగిరి కోలంక గ్రామాల్లో ఇద్దరు అధ్యక్షులను మార్పు చేశారు. నూతనంగా కోలంక సహకార సంఘ అధ్యక్షులుగా తోగరు చంద్రశేఖర్, జగన్నాథగిరి సహకార సంఘ అధ్యక్షులుగా కాకర్లపూడి వీరభద్ర రాజును నియమించినట్లు తెలియ వచ్చింది. వీరు కొద్దిరోజుల్లో అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

లోవ దేవస్థానంలో పనుల పరిశీలన

ప్రజాశక్తి-కోటనందూరు

తుని తలుపులమ్మ తల్లి దేవస్థానంలో అభివృద్ధి పనులను రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులను, వన్ వే రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానానికి వచ్చే యాత్రికులకు మెరుగైన వసతులు కల్పించాలని లక్ష్యంతోనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్టు చెప్పారు. సిబ్బంది సమన్వయంతో పని చేసి యాత్రికులకు అసౌకర్యం లేకుండా చూడాలని సూచించారు. అనంతరం తలుపులమ్మ తల్లి ఆలయ సహాయక కమిషనర్ పెనుముచ్చు విశ్వనాథ రాజు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు పట్టు వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తోట దుర్గేష్ కుమార్, డిఇ ఉదయ్ కుమార్, శ్రీనివాస్ ఆచార్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

రాజీవ్ పార్క్‌లోకి ప్రవేశించిన వరద నీరు

యానాంలో పెరుగుతున్న గోదావరి వరద

ప్రజాశక్తి - యానాం

యానాం వద్ద గోదావరి వరదనీరు అంతకంతకు పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా వరదనీటిని దిగువకు వదులుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద రెండవ ప్రమాదక హెచ్చరిక కొనసాగుతుంది. దీంతో వరదనీరు గౌతమీ గోదావరి గుండా యానాం మీదుగా ప్రవహించి సముద్రంలో కలుస్తోంది. యానాం-ఎదుర్లంక వారధి వద్ద వరద ఉధతి కొనసాగుతుంది. యానాం పుష్కర్ ఘాట్, రాజీవ్ పార్క్ నీట మునిగాయి. ఓల్డ్ రాజీవ్ నగర్, గురుకృష్ణాపురంలోకి వరద నీరు రాకుండా మోటార్ల సహాయంతో నీటిని తోడుతున్నారు. ఇసుక బస్తాలను సిద్ధం చేసి అడ్డుకట్ట వేస్తున్నారు. ఈ సందర్భంగా యానాం పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, పుదుచ్చేరి ప్రభుత్వం ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శుక్రవారం పలు ప్రాంతాలను పరిశీలించారు.

క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న మల్లాడి కృష్ణారావు

నవోదయలో ముగిసిన క్లస్టర్ క్రీడా పోటీలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయలో గత రెండు రోజులుగా తొమ్మిది జిల్లాల విద్యార్థులతో ఏపీ-1 క్లస్టర్ క్రీడా పోటీలు,వైజ్ఞానిక ప్రదర్శనల నిర్వహించారు. శుక్రవారం ముగింపు వేడుకలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కష్ణారావు, ఎస్‌పి రఘునాయగం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ నవోదయ విద్యాలయలో చదివితే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. యానాంలో నవోదయ విద్యాలయ స్థాపించడానికి జిఎంసి బాలయోగి ముఖ్య కారకులని గుర్తు చేశారు. ప్రిన్సిపల్ టివిఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ యానాం నవోదయ పుదుచ్చేరి స్థాయిలో ఫలితాల్లో ప్రథమ స్థానంలో ఉందని, విద్యార్థులు, అధ్యాపకుల కషితోనే ఇది సాధ్యమైందన్నారు. కష్ణా, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి తదితర జిల్లాల నుంచి 160 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన ఆయా జిల్లాల క్రీడాకారులకు మెమెంటో, ప్రశంస పత్రాలు అందించారు. లెక్చరర్లు సుధాకర్, శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 27న ఎల్‌డిసి రాత పరీక్ష

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి వ్యాప్తంగా లోయర్ డివిజన్ క్లర్క్, స్టోర్ కీపర్ గ్రూప్ 3 పోస్టుల భర్తీకి సంబంధించి ఆగస్టు 27న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు అండర్ సెక్రటరీ వి.జయశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాత పరీక్షకు సంబంధించి హాల్ టికెట్లు డౌన్లోడ్, ఎగ్జామ్ సెంటర్లు తదితర వివరాలను త్వరలో తెలియజేయనున్నట్లు తెలిపారు.

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి

ప్రజాశక్తి-కోటనందూరు

పరిపాలన అనుభవం లేకపోవడం వల్ల సిఎం వైఎస్.జగన్ పరిపాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి యనమల కృష్ణుడు అన్నారు. శుక్రవారం తుని రూరల్ సీతయ్యపేటలో టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను గడపగడపకూ ప్రసారం చేస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన మహాశక్తి పథకం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. పరిపాలన దక్షత కలిగిన చంద్రబాబును మళ్ళీ ముఖ్యమంత్రి చేస్తే రాష్ట్రానికి పూర్వ వైభవం వస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలనాటి శేషగిరి మోతుకూరి వెంకటేష్, అప్పన రమేష్, వంగలపూడి బుజ్జి అరిగెల నరసింహారెడ్డి, గాది వరహాల బాబు, కొండు నాగేశ్వరరావు, దంతులూరు శ్రీనివాసరాజు, గొల్ల రమణమ్మ, బుట్ట సత్యవతి, ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

బడి బయట పిల్లల గుర్తింపు

ప్రజాశక్తి -కరప

మండలంలో బడి బయట ఉండే పిల్లలను బడిలో చేర్పించే విధంగా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ కె.అప్పారావు ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.అప్పారావు ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులు కె.బుల్లి కృష్ణవేణి, పి.సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సచివాలయ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్, సిఆర్పిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంఇఒకె కృష్ణవేణి మాట్లాడుతూ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్, సిఆర్‌పిలతో బడిబయట ఉండే పిల్లలు 219 మందిని వాలంటీర్ల సాయంతో గుర్తించి వాళ్లను బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ వేగుళ్ల

అసంపూర్తిగా తాపేశ్వరం -ద్వారపూడి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని తాపేశ్వరం - ద్వారపూడి రోడ్డు పనులు ఎప్పటికి పూర్తి చేస్తారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరై మూడేళ్ళు అయిందన్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టి ఏడాది పూర్తయిందన్నారు. రోడ్డు నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు వందలాది మంది ప్రయాణికులు గాయాలపాలయ్యారన్నారు. త్వరితగతిన రోడ్డు పూర్తి చేసి ముగింపు పలకక పోతే ప్రజలతో కలిసి టిడిపి తరపున ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని ఎంఎల్ఎ వేగుళ్ళ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి టౌన్ ప్రెసిడెంట్ వుంగరాల రాంబాబు, వాకచర్ల గుప్తా పాల్గొన్నారు.

వైసిపి బిసి సెల్ మండల అధ్యక్షునిగా పళ్లంరాజు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

వైసిపి బిసి సెల్ విభాగం మండల అధ్యక్షునిగా ఉప్పలగుప్తంకు చెందిన యనమదల పళ్లంరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఆయన కుమారుడు డాక్టర్ శ్రీకాంత్‌లను పళ్ళంరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. పళ్లంరాజును మంత్రి విశ్వరూప్, శ్రీకాంత్‌లు అభినందించి ప్రభుత్వం చేస్తున్న అభివద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.ఆయన వెంట వైసిపి నాయకులు మోటూరి సత్యం కాపు తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా ఓటర్ల సర్వే

ప్రజాశక్తి-అంబాజీపేట

మాచవరం పోలింగ్ బూత్ 118 ఏరియాల్లో ఓటర్ వెరిఫికేషన్ శుక్రవారం టిడిపి క్లస్టర్ ఇంఛార్జి గణపతి వీరరాఘవులు ఆధ్వర్యంలో బొంతు పెదబాబు, గుడాల ఫణి తదితరులు పాల్గొన్నారు. వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా ఓటర్ వెరిఫికేషన్ చేయా లని కోరారు. కె.పెదపూడి బూత్ 140లో మండల ప్రధాన కార్యదర్శి గుడాల ఫణి, ఇ.హనుమంతరావు పెదపూడి శ్రీనివాసరావులు పాల్గొని ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉన్నది లేనిది పరిశీలించుకోవాలన్నారు.

అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఈ సంవత్సరం నుంచే ప్రారంభమవుతుందని మంత్రి విశ్వరూప్ అన్నారు. ప్రస్తుతం కాలేజ్ రోడ్డు లో ఉన్న బీకన్న హోటల్ ఎదురుగాఉన్న భవనంలో తాత్కాలికంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయటకు ఉత్తర్వులు వచ్చాయన్నారు. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ ఉత్తర్వులను మంత్రి క్యాంప్ కార్యాలయంలో ప్రొసీడింగ్స్‌ను డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వి.నరసింహస్వామి మంత్రి చేతులమీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. నియోజకవర్గంలో ఉన్న పేద, మధ్య తరగతి విద్యార్థులదరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి అన్నారు. కార్యక్రమంలో లెక్చరర్స్ ఎమ్.బాలా స్వామి, మురళి కృష్ణ, నాయకులు చెల్లుబోయిన శ్రీను, సంసాని బుల్లినాని, నాగారపు వెంకటేశ్వ రరావు, బొంతు గోవింద్‌శెట్టి, పొలమురి బాలకృష్ణ, మాజీ విద్యార్థి సంఘ నాయకులు గంటి చిరంజీవి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అనుమతులను ప్రదర్శిస్తున్న మంత్రి విశ్వరూప్


గడప..గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి వేణు

'యనమదల' రోడ్డు నిర్మించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి- రామచంద్రపురం

మండలం లోని యనమదల గ్రామంలో రోడ్డును ఆధునికీకరించాలని గడప..గడపకూ మన ప్రభుత్వంకార్యక్రమంలో పాల్గొన్న మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు గ్రామస్తులు విన్నవించారు. పెద్దపెద్ద గోతులు ఏర్పడిన యనమదల-రామచంద్రపురం రహదారిలో వర్షాకాలం పరిస్థితి మరింత దారుణంగా ఉందని గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ లక్ష్యంగా అమలుచేస్తున్న పథకాలను మంత్రి వివరిస్తూ రోడ్ల సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ప్రజలు తెలిపిన పలు సమస్యలపరిష్కారానికి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట మండల పరిషత్ అధ్యక్షులు అంబటి భవాని, గ్రామ సర్పంచ్ పివివి.రమణ, పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజు పడిపోయినది

కాకినాడ జిల్లా, సామర్లకోట మండలం, సామర్లకోట, చిన్నవీధికి చెందిన జ్యోతుల లక్ష్మి, భర్త: రాజుబాబు, తండ్రి: దేగల రామారావుకు చెందిన మండలంలోని **కాపవరం గ్రామంలో సర్వే నెం. 189/2లో గల భూమి య.0-50 సెంట్లు** భూమికి చెందిన ఒరిజినల్ దస్తావేజు ది.21-07-2023 నాడు సామర్లకోటలో జిరాక్సు తీయించుకొనుటకు వెడుతుండగా మార్గం మధ్యలో పడిపోయినది. కావున సదరు దస్తావేజు ఎవరికైనా దొరకిన ఎడల క్రింది చిరునామాకు అందచేయమని కోరుతున్నాను.

జ్యోతుల లక్ష్మి
భర్త: రాజుబాబు, డో.నెం. 12-6-101,
చిన్న వీధి, సామర్లకోట, కాకినాడ జిల్లా.
సెల్: 99122 89849

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

M.V.O.P.No. 45/2022

Between:

రాశంశెట్టి కృష్ణ ...పిటీషనరు

అండ్

ఎస్.రాంబాబు వగైరాలు ...రెస్పాండెంట్లు

R-2: మిరపాల దుర్గ, భర్త: సూర్యప్రకాశ్, 36 సం॥లు, డో.నెం. 57-2-2, యేసువారి వీధి, జగన్నాధపురం, కాకినాడ-2.

పై నెంబరు పిటీషనును పిటీషనరు మీ నుండి నష్ట పరిహారము ఇప్పించమని కోరుచూ పిటీషను దాఖలు చేసి మీకు కోర్టు ద్వారా ఎన్ని మార్లు సమన్లు పంపినను త్రిప్పి వేయుచున్నందున ఇందుమూలముగా మీకు తెలియచేయునది ఏమనగా పై నెంబరు పిటీషను **ది. 24-08-2023వ తేదీకి వాయిదా మీ హాజరుకై ఉన్నది. కావున పై తేదీనాడు కోర్టు వారి ఎదుట ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని అభ్యంతరముల ఉన్న తెలుపుకొనగలరు.** లేని ఎడల సదరు పిటీషను మీ పరోక్షములో నిర్ణయించ బడునని గ్రహించగలరు.

K.V.V.CHALAPATHI
UDDANDA UMA GOWRI
కాకినాడ Advocates, Kakinada
22-7-2023 Cell: 9848260426

In the Court of the Principal District Judge, Eluru

M.V.O.P. No. 585/2022

Between:

Nimiditalli Ratna Kumar ***...Petitioner***

AND

Pattapagala Srinivas and Others ***...Respondents***

To:

R-1: Pattapagala Srinivas, S/o. Chandra Rao, Driver of Lorry AP 37 TD 2759, Yadava Street, Nidadavolu V & M, East Godavari District.

పై నెంబరు నందు 1st Respondent వార్కి ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిన మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. **ది. 02-8-2023న ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు గాని, మీ ప్లీడరు గారు గాని హాజరు కావలెను. లేని ఎడల పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా: 02-8-2023

ELURU VENKATESWARA RAO
ELURU SESHA MAHESH BABU
Advocates, Eluru
Cell: 9440188677